క్లుప్తంగా

సుగుణారెడ్డికి అంతర్జాతీయ పురస్కారం


పురస్కారం అందుకున్న సుగుణారెడ్డి

బాలాజీచెరువు: ఆదిత్య విద్యా సంస్థల డైరెక్టర్, లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డికి ఇంటర్నేషనల్ బెస్ట్ స్కూల్ విత్ హోలిస్టిక్ ఎడ్యుకేషన్ అవార్డు లభించింది. ఇంటర్నేషనల్ స్కూల్ అవార్డ్స్ దుబాయ్ అధినేత అక్షయ్ అహుజా ఆధ్వర్యంలో ఫిబ్రవరి 26న దుబాయ్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రపంచ వ్యాప్తంగా 10 దేశాల నుంచి పాఠశాలల డైరెక్టర్లు పాల్గొన్నారు. అవార్డును ప్రిన్స్ ఫ్రాంక్లిన్ (సౌత్ ఆఫ్రికా), దుబాయ్ స్కూల్ అధినేత అక్షయ్ అహుజా చేతుల మీదుగా తీసుకోవడం సంతోషంగా ఉందన్నారు.

74 వాహనాల వేలం


వాహనాలను పరిశీలిస్తున్న అదనపు ఎస్పీ శ్రీనివాస్

కాకినాడ క్రైం: మద్యం, సంబంధిత కేసుల్లో పట్టుబడ్డ పలు వాహనాలను జిల్లా పోలీస్ శాఖ సెబ్ సంయుక్త ఆధ్వర్యంలో వేలం వేశారు. అదనపు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేలం పాటలో 74 వాహనాలను రూ.10.87 లక్షలు మొత్తానికి పాడుకున్నారు. ఇందులో జీఎస్టీ విలువ రూ.1.5 లక్షలని అధికారులు తెలిపారు.

వైభవంగా మేఖలాల ప్రతిష్ఠ


సీతారామాలయంలో ధ్వజస్తంభ మేఖలాలకు పూజలు చేస్తున్న ధర్మకర్తలు

బోట్‌క్లబ్: స్థానిక ప్రతాప్‌నగర్ వాటర్ ట్యాంకు సమీపంలోని జగన్మోహన సీతారామాలయంలో మంగళవారం ధ్వజసంభ మేఖలాల ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. ఈసందర్భంగా ఆలయ ధర్మకర్త వంగూరి శ్రీనివాసు మాట్లాడుతూ 1972 ఆలయంలో నిర్మించారని, ధ్వజస్తంభం మేఖలాలు పాడవడంతో దాతల సహకారంతో కొత్తవి పునః ప్రతిష్ఠ చేసినట్లు చెప్పారు.

టీడీపీ నాయకుల పర్యటన


కరప: మండలం పెనుగుదురులో మంగళవారం టీడీపీ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పర్యటించి 'ఇంటింటికీ మీ అనంతలక్ష్మి, ఇదేమి కర్మ మనరాష్ట్రానికి' నిర్వహించారు. టీడీపీ రాష్ట్రప్రధానకార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ జెడ్పీటీసీ బుంగా సింహాద్రి, మాజీఎంపీపీ గుల్లిపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దక్షిణ భారత కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


రెండో ఓవరాల్ చాంపియన్ ట్రోఫీని అందుకున్న విద్యార్థులతో కోచ్

సామర్లకోట: విశాఖపట్నం శిల్పారామంలో ఆదివారం జరిగిన సౌత్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో సామర్లకోటకు చెందిన కరాటే పాఠశాల విద్యార్థులకు పలు పతకాలు లభించాయి. కోచ్, ఏపీ సౌత్ జోన్ కరాటే అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డి. శంకరరావు మంగళవారం సాయంత్రం స్థానిక విలేకర్లకు వివరాలు తెలిపారు. సామర్లకోట, కాకినాడ, రాజమహేంద్రవరం ప్రాంతాల నుంచి తమ విద్యార్థులు 128 మంది ఈ పోటీల్లో పాల్గొన్నారని, ఒక బంగారు, నాలుగు రజత, 10 కాంస్య పతకాలు లభించాయని చెప్పారు. ఈ పోటీల్లో కాకినాడ జిల్లాకు రెండో చాంపియన్ ట్రోఫి లభించడం ఆనందంగా ఉన్నదని శంకరరావు అన్నారు.

రెండు మోటారు సైకిళ్లు దగ్ధం


కాలిపోయిన స్కూటీ, టీవీఎస్ మోపెడ్

సామర్లకోట: స్థానిక బళ్ల మార్కెట్ భీమవరపుపేటలో నిలిపి ఉంచిన స్కూటీ, టీవీఎస్ మోపెడ్‌లు సోమవారం అర్ధరాత్రి కాలి బూడిద అయ్యాయి. భీమవరపుపేటకు చెందిన దూలపల్లి రాజు, పి అప్పలరాజు రోడ్డుపై మోటారు సైకిళ్లను ప్రతి రోజులానే పెట్టారు. అయితే అర్ధరాత్రి 12 గంటల సమయంలో మోటారు సైకిళ్లు కాలి పోతున్నట్లు స్థానికులు గమనించారు. అప్పటికే రెండు మోటారు సైకిళ్లతో పాటు సమీపంలో ఉన్న మరో మోటారు సైకిల్ పాక్షికంగా దెబ్బతింది. దూలపల్లి రాజు తన స్కూటీలో ఉంచిన రూ.50వేల నగదు కాలి బూడిదైంది. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జీబ్రాతో ప్రమాదాలకు బ్రేక్

- అధికారులకు విద్యార్థుల విన్నపం
- స్కూల్ జోన్‌లపై అవగాహన కల్పించడంలో విఫలం
- సగటున నిత్యం పది ప్రమాదాలు
- అమాత్యుల ప్రయాణం సాఫీగా సాగేందుకు వేసిన స్పీడ్ బ్రేకర్ల తొలగింపు


జీబ్రా క్రాసింగ్ లేని జేఎన్‌టీయూ, ఐటీఐ విద్యాలయాల కూడలి

బాలాజీచెరువు: నిత్యం వేలాది వాహనాలు ప్రయాణించే ప్రధాన రహదారిలో కనీసం జీబ్రా క్రాసింగ్, స్పీడ్ బ్రేకర్లు కూడా కనుమరుగవడంతో ఆ కూడళ్లు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. ముఖ్యంగా కూడళ్లలో విద్యా సంస్థలు ఉండటంతో ఈ పరిస్థితి తలెత్తుతోంది. నగర ప్రధాన రహదారిలో ప్రారంభం కానున్న అచ్చంపేట జంక్షన్ నుంచి సర్పవరం జంక్షన్, స్పెన్సర్, బోట్‌క్లబ్, నాగమల్లితోట జంక్షన్, అల్లూరి సీతారామరాజు విగ్రహం, వినాయకుడి గుడి కూడలి, ప్రభుత్వ ఐటీఐ జేఎన్‌టీయూకే, రంగరాయ వైద్య కళాశాలల వంటి విద్యా ప్రాంగణాల కూడళ్ల వద్ద వేగ నిరోధకాలు లేకపోవడంతో నిత్యం చిన్నో, పెద్దో ప్రమాదం జరుగుతూనే ఉంది. గత నెలలో ఏపీ ఎస్పీ స్కూల్ జోన్ వద్ద ఏర్పాటుచేసిన స్పీడ్ బ్రేకర్లు మూడు రోజులకే తొలగించారు. సర్పవరం జంక్షన్ నుంచి భానుగుడి వరకూ ఉన్న పది కూడళ్ల మీదుగా వెళ్లాలంటే వాహనచోదకులు, పాదచారులు ప్రాణాలు అరిచేత పెట్టుకోవలసి వస్తోంది. ఈ కూడళ్లలో సగటున నిత్యం పది ప్రమాదాలు సంభవిస్తున్నాయంటే అతిశయోక్తి కాదు. స్మార్ట్ సిటీ రహదారి విస్తరణలో భాగంగా సర్పవరం నుండి భానుగుడి వరకూ రోడ్డుకు ఇరువైపులా ఆరు అడుగులు పెంచి ఫుట్‌పాత్‌లతో పాటు సైక్లింగ్ ట్రాక్ నిర్మించారు. ప్రధాన రహదారుల్లో స్పీడ్ బ్రేకర్లు వేయకూడదనే నిబంధన ఉండగా అప్పట్లో జేఎన్‌టీయూ డైరెక్టర్ రవీంద్ర సిఫార్సు మేరకూ అక్కడి ప్రధాన రహదారి వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. మంత్రులు జిల్లా సందర్శనకు వచ్చినప్పుడు ట్రయల్ రన్ పేరుతో కాన్వాయ్‌కు సమస్య ఏర్పడుతోందని అధికారులు వాటిని తొలగించారు. దీంతో విద్యార్థులకు, పాదచారులకు ప్రాణ సంకటంలా మారింది.

స్కూల్ జోన్‌ల వద్ద ప్రమాదాలు..



విద్యాలయాల కూడళ్లలో జీబ్రా క్రాసింగ్, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని అనేక సార్లు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విన్నవించాం. నాగమల్లితోట జంక్షన్, తోట సుబ్బారావు విగ్రహం వద్ద స్పీడ్ బ్రేకర్లు వేయాలని కోరుతున్నాం.స్కూల్ జోన్ ప్రాంతం అనే అవగాహన లేకుండా చాలా వేగంగా నడుపుతున్నారు. దీంతో విద్యార్థులు ప్రమాదాలబారిన పడుతున్నారు.
– తొట్టిపూడి రాజా, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ప్రధాన రహదారిలో స్పీడ్ బ్రేకర్లు ఉండకూడదు..

ప్రధాన రహదారిలో స్పీడ్ బ్రేకర్లు ఉండకూడదన్న నిబంధన వల్ల వేసిన జీబ్రా లైన్లను తొలగించాం. ట్రాఫిక్ రద్దీ సమయంలో ప్రధాన కూడళ్లలో విద్యాలయాల వద్ద పాదచారులకు, వాహన చోదకులకు ఇబ్బందులు ఎదురవుతున్న మాట నిజమే. ట్రాఫిక్ సిబ్బందిని నియమించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం.
– మురళీకృష్ణారెడ్డి, డీఎస్పీ, ట్రాఫిక్ విభాగం

బహుముఖ ప్రజ్ఞాశాలి ఉమర్ ఆలీషా


మౌల్వీ డాక్టర్ ఉమర్ ఆలీషా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రముఖులు

కాకినాడ రూరల్: స్వాతంత్ర్య సమర యోధునిగా, మహా కవిగా, సంఘ సంస్కర్తగా, వేదాంత వేత్తగా మౌల్వీ డాక్టర్ ఉమర్ ఆలీషా కీర్తి ప్రతిష్టలు సంపాదించారని సభాధ్యక్షుడు అహ్మద్ ఆలీషా అన్నారు. మంగళవారం కాకినాడ బోట్‌క్లబ్ వద్ద గల కవి శేఖర్ డాక్టర్ ఉమర్ ఆలీషా విగ్రహం వద్ద ఆయన జయంతి నిర్వహించారు. ప్రస్తుత పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా, ఆయన సోదరుడు అహ్మద్ ఆలీషా అధ్యక్షత వహించగా, మరొక సోదరుడు హుస్సేన్‌షా, అహ్మద్ ఫజల్, పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు, పీఠం సెంట్రల్ కమిటీ సభ్యుడు ఎవీవీ సత్యనారాయణ వేదికపై ప్రసంగించారు. అహ్మద్ ఆలీషా మాట్లాడుతూ వందేళ్ల క్రితం అజ్ఞానం, మూఢ నమ్మకాలను తరిమికొట్టి సమాజాన్ని సంస్కరించిన బహుముఖ ప్రజ్ఞాశాలి ఉమర్ ఆలీషా అన్నారు. ఉమర్ ఆలీషా పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ హుస్సేన్‌షా, సత్యనారాయణ తదితరులు ఆయన రచనలు, స్త్రీజనోద్ధరణపై మాట్లాడారు. సభా నిర్వాహకుడు పేరూరి సూరిబాబు మాట్లాడుతూ ఆయన రాసిన పద్మావతి అనే నవలను ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు నాన్ డీటెయిల్డ్‌గా 45 ఏళ్ల క్రితమే డిగ్రీ కళాశాలలో పాఠ్య పుస్తకాలుగా ప్రకటించారన్నారు. అమృతవల్లి మాట్లాడుతూ ప్రజా ప్రతినిధిగా ఆచరణాత్మక సూచనలతో, అనర్గళంగా ప్రసంగించిన మహామహుడు ఉమర్ ఆలీషా అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అహ్మద్ ఆలీషా కేక్ కట్ చేసి పంచారు. పిఠాపురం విశ్రాంత పెన్షనర్ల సంఘం సభ్యులు, పురుహూతికా లలితకళా పరిషత్ నిర్వాహకుడు ప్రసాద్ తదతరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి

ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి


ఎమ్మెల్యే ద్వారంపూడిని కలిసిన వైఎస్సార్ సీపీ చేనేత విభాగం అధ్యక్షుడు పంపన రామకృష్ణ

కాకినాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను మరింత సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి సూచించారు. వైఎస్సార్ సీపీ చేనేత విభాగం అధ్యక్షుడిగా నియమితులైన పంపన రామకృష్ణ మంగళవారం ఎమ్మెల్యే ద్వారంపూడిని మర్యాదపూర్వకంగా కలిసారు. ఎమ్మెల్యే ఆయనను అభినందించారు. పార్టీ పటిష్టతకు, రానున్న ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. నాయకులు ఆర్జి సూర్యారావు, శీరం ప్రసాద్, గోపి, వానపల్లి గోవిందు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు భావి శాస్త్రవేత్తలు కావాలి

- ఎంఈఓ బుల్లికృష్ణవేణి
- ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు
- అభినందించిన ఉపాధ్యాయులు


పెద్దాపురప్పాడు హైస్కూలులో సైన్స్ ప్రాజెక్టులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కరప: మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సర్ సీవీ రామన్ చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నివాళులర్పించారు. ఎంఈఓ కె.బుల్లికృష్ణవేణి మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్ పట్ల అభిరుచిని పెంపొందించుకుని భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. పాఠశాల్లో సైన్స్ ఉపాధ్యాయులు సర్ సీవీ రామన్ జీవిత విశేషాలు, విజ్ఞానశాస్త్రంలో ఆయన చేసిన విశేష సేవలను వివరించారు. పెద్దాపురప్పాడు, గురజనాపల్లి, అరట్లకట్ట, కూరాడ, వేళంగి తదితర గ్రామాల్లోని హైస్కూళ్లల్లో సైన్స్ ఎగ్జిబిషన్లు ఆకట్టుకున్నాయి పెద్దాపురప్పాడు హైస్కూలులో సైన్స్ ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఒక విద్యార్థి ప్రదర్శించిన ప్లాస్టిక్ భూతం వేషధారణ ఆకట్టుకుంది. పలు పాఠశాలల్లో వ్యాసరచన, క్విజ్ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. వివిధ హైస్కూళ్లలో జరిగిన కార్యక్రమాల్లో హెచ్ఎంలు ఎస్ఎస్ఎం శ్రీనివాస్, బీఆర్‌వీ ప్రసాదరావు, ప్రత్తి సత్యనారాయణ, ఎన్‌బీవీ రాణా ప్రతాప్, భారతి, ఉపాధ్యాయులు ఐ.ప్రసాదరావు, బి.లక్ష్మీనారాయణ, బీవీవీఎస్ ప్రసాద్, జి.అర్జునరావు, సీహెచ్ రమేష్, నాగలింగేశ్వరరావు, వీర్రాజు, పి.శివగిరి, బి.లక్ష్మీప్రసాద్, పి.కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విఖ్యాత శాస్త్రవేత్త రామన్

నాగమల్లితోట జంక్షన్: రామన్ ఎఫెక్ట్ ప్రయోగం ద్వారా ప్రపంచానికి భారతీయ శాస్త్ర, సాంకేతికత సత్తా చాటిన మహనీయుడు సర్ సీవీ రామన్ అని నారాయణ పాఠశాలల ఏజీఎం కె.రాఘవేంద్రరావు పేర్కొన్నారు. స్థానిక రామారావు పేట, లక్ష్మీనగర్‌లోని నారాయణ పాఠశాలల్లో మంగళవారం జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఈ సందర్భంగా తయారు చేసిన నమూనాలు ఆలోచింపజేసేవిగా ఉన్నాయని జోనల్ అకడమిక్ కో–ఆర్డినేటర్ సుంకర మూర్తి తెలిపారు. 9వ తరగతి విద్యార్థులు తయారు చేసిన స్పేస్ రూమ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ కవిత, షర్మిల, వైస్ ప్రిన్సిపాల్ నాగమణి, ఈ–చాంప్స్ కో–ఆర్డినేటర్ రామతులసి, సఫోరా తదితరులు పాల్గొన్నారు.

భాష్యం పాఠశాలలో..

కాకినాడ: స్థానిక భాష్యం పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఎక్స్‌పోకు కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థుల ప్రయోగాలను పరిశీలించారు. చదువుతో పాటు ఇతర రంగాల్లోనూ విద్యార్థులు బాగా రాణించాలన్నారు. భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ, డైరెక్టర్ భాష్యం హనుమంతరావు, సంస్థ జోనల్ ఇన్‌చార్జ్ వి.గోవిందరాజు, ప్రిన్సిపాల్ ఈవీ అనురాధ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాకినాడ సిటీ: సర్ సీవీ రామన్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని గుంటూరు ఆక్స్‌ఫర్డ్ స్కూల్ కాకినాడ శాఖలో సైన్స్ ఎక్స్‌పో నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపల్ శిరీష మాట్లాడుతూ విద్యార్థులు చేసిన పనిని ఇతరులతో పంచుకోవడం వల్ల ఆ భావనలపై అవగాహన పెరుగుతుందన్నారు. విద్యార్థులు చేసిన హైడ్రాలిక్ జేసీబీ, న్యూటన్ లా, కండక్షన్ ఆఫ్ వాటర్, సెడిమెంటేషన్, డయాలసిస్ తదితర ప్రయోగాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పద్మ, వేణి, భారతి, పూర్ణిమ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థులు తయారు చేసిన స్పేస్ రూమ్‌లో ప్రిన్సిపాల్ షర్మిల


సైన్స్ ఎగ్జిబిషన్‌ను సందర్శిస్తున్న డీన్ ఉమామహేశ్వరరావు

బాలాజీచెరువు: విద్యార్థులు సామర్థ్యం కలిగిన చైతన్యవంతులై అవకాశాలు ఒడిసిపట్టాలని, సరికొత్త విధానాలతో నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలని ఆశ్రమ పబ్లిక్ స్కూల్ డీన్ ఎస్.ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా మంగళవారం కాకినాడ పబ్లిక్ స్కూల్లో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. సైన్స్ ఎగ్జిబిషన్‌తో పాటు వివిధ రాష్ట్రాల ఆహార ప్రదర్శన ఆకట్టుకుంది. సర్వోదయ ఎడ్యుకేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ లింగమల్లు కృష్ణమూర్తి, కాకినాడ కాలేజ్ ప్రిన్సిపాల్ గ్రేస్ మణికమారి, స్కూల్ ప్రిన్సిపాల్ శారద, సభ్యులు డీవీఆర్ ప్రసాద్, గాంధీ పాల్గొన్నారు.


భాష్యం విద్యార్థుల ప్రదర్శనలను తిలకిస్తున్న కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి


అరట్లకట్ట హైస్కూలులో క్విజ్‌పోటీ విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం


కూరాడ హైస్కూలులో రామన్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం


గురజనాపల్లి హైస్కూలులో డాక్టర్ సీవీ రామన్‌కు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలి


వైద్యసేవలందించిన డాక్టర్ కార్తీక్‌ను సత్కరిస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

కరప: షుగరు, బీపీ పేషంట్లు క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకుంటూ, వైద్యుల సలహా మేరకు ఆరోగ్యనియమాలు పాటిస్తే ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని మెడికవర్ హాస్పటల్ డాక్టర్ కార్తీక్ సూచించారు. గురజనాపల్లిలో ఆదివారం కాకినాడ స్టార్స్ లయన్స్ క్లబ్ ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో ఆయన వైద్య పరీక్షలు నిర్వహించి, సూచనలు చేశారు. గురజనాపల్లి గ్రామస్తుడు, కాకినాడ మైత్రి లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ కర్నాసుల శివకుమార్ మాట్లాడుతూ ల్యాబ్ టెక్నీషియన్లు, లయన్స్‌క్లబ్ సభ్యులు బృందాలుగా ఏర్పడి రెండు రోజుల పాటు 965 మందికి షుగరు, బీపీ పరీక్షలు నిర్వహించగా 235 మందికి పలు వ్యాధులున్నట్టు గుర్తించి మందులు అందజేశారు. వైద్యసేవలందించిన డాక్టర్ సతీష్, ఇతర సిబ్బందిని గ్రామస్తుల తరపున లయన్స్ క్లబ్ ప్రతినిధులు సత్కరించారు. లయన్స్‌క్లబ్ కాకినాడ స్టార్స్ ప్రెసిడెంట్ సీహెచ్ గణేష్‌ప్రసాద్, సెక్రటరీ గరికిపర్తి నమశ్శివాయ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

సామర్లకోట: స్థానిక కాకినాడ రోడ్డులో ముత్యాలమ్మ ఆలయం సమీపంలోని అచ్చంపేట ఫ్లైఓవర్ వద్ద మంగళవారం సాయంత్రం మోటారు సైకిలును వ్యాన్ ఢీకొంది. దాంతో మోటారు సైకిలుపై వెళుతున్న వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు క్షతగాత్రుడిని 108లో కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. క్షతగాత్రుని వివరాలు తెలియాల్సి ఉన్నదని పోలీసులు తెలిపారు.

ఘనంగా టైలర్స్ దినోత్సవం


దర్జీలను సత్కరిస్తున్న అడబాల ట్రస్ట్ సభ్యులు

కాకినాడ రూరల్: స్థానిక రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ టైలర్స్ దినోత్సవం జరిగింది. ట్రస్ట్ చైర్మన్ అడబాల రత్నప్రసాద్ మాట్లాడుతూ గతంలో దర్జీల పని దర్జాగా ఉండేదని, నేటి ఆధునిక సమాజంలో రెడీమేడ్ వస్త్రాలతో పాటు ఆన్‌లైన్ ద్వారా వస్త్రాలు అందుబాటులోకి రావడంతో దర్జీల పని దుర్భరంగా మారిందన్నారు. శ్రీ టైలర్స్ అధినేత అల్లం కుమారరాజు మాట్లాడుతూ కుట్టు మిషన్ సృష్టికర్త విలియమ్స్ హూ జయంతి సందర్భంగా ప్రపంచ టైలర్స్ దినోత్సవం నిర్వహించుకుంటున్నట్టు తెలిపారు.


విలియమ్స్ హూవే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దర్జీలు

టైలర్లను ఆదుకోవాలి

బోట్‌క్లబ్: రెడీమేడ్ రంగంతో కుదేలైన టైలర్లను ఆదుకోవాలని విఘ్నేశ్వర ప్రాథమిక టైలర్ల సహకార సంఘం అధ్యక్షుడు బీఎస్ఎస్ సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక ఏసువారివీధిలో మంగళవారం టైలర్స్ డే నిర్వహించారు. కుట్టుమిషన్ సృష్టికర్త విలియమ్స్ హోవే చిత్రపటానికి నివాళి అర్పించారు. సంఘ కార్యదర్శి ఓటేటి సూరిబాబు, సభ్యులు కర్రి విజయలక్ష్మి, చిన్మయి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహాలక్ష్మీ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

- అర్చకులచే కలశ స్థాపన
- నేడు మంత్రులచే శ్రీవారి పుష్కరిణి ప్రారంభోత్సవం

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద నిర్మించిన శ్రీవారి పుష్కరిణిలో మహాలక్ష్మీ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా జరిగింది. మంగళవారం ఉదయం శాస్త్రోక్తంగా అర్చకులు శ్రీవారి పుష్కరిణి మధ్యలో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం ఆలయంపై కలశ స్థాపన చేసి, కుంభాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద కలశాల ఊరేగింపు, చతుర్వేద పారాయణం, యాగశాలార్చన, హోమం, యంత్ర ప్రతిష్ఠ, రత్నన్యాసం, పిండికాన్యాసం, నివేదన, కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేశారు. సాయంత్రం యాగశాలారాధన, మూలమంత్ర తదితర సేవలు నిర్వహించారు. లోవ ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.


మంత్రులు నేడు ప్రారంభించనున్న శ్రీవారి పుష్కరిణి


శిఖరంపై కలశ ప్రతిష్ఠ చేస్తున్న అర్చకులు

నేడు మంత్రులచే పుష్కరిణి, విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

పాత సంచుల వర్తక సంఘం, గ్రామస్తుల ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 7.40 గంటలకు శ్రీవారి పుష్కరిణి ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు జరపనున్నట్లు సంఘం అధ్యక్షుడు, దేవస్థానం చైర్మన్ కోలా భీమేశ్వరరావు తెలిపారు. దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా దంపతులచే పుష్కరిణి ప్రారంభం, పాండురంగస్వామి, వరాహస్వామి, హయగ్రీవ, పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహాల ప్రతిష్ఠ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఈ కార్యక్రమాల్లో ముఖ్య అతిథులతో పాటు పార్లమెంట్ సభ్యురాలు వంగా గీత, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, పెండెం దొరబాబు, పర్వత పూర్ణచంద్ర ప్రసాద్, ఇతర నాయకులు, అధికారులు పాల్గొంటారని తెలిపారు.

బాలుడి వైద్యానికి ఆర్థిక సహాయం


వలంటీర్ల ఆర్థిక సహాయాన్ని బాలుడి కుటుంబ సభ్యులకు అందిస్తున్న కార్యదర్శి టంకాల శ్రీనివాసరావు

గోకవరం: అరుదైన వ్యాధితో బాధపడుతున్న బాలుడి వైద్యానికి గోకవరం వలంటీర్లు తమ వంతు ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామానికి చెందిన పొట్నూరి సతీష్ కుమారుడు రెండున్నరేళ్ల సత్యశ్రీఅక్షయ్‌రామ్ సీజీడీ అనే అరుదైన వ్యాధి బారిన పడ్డాడు. చికిత్సకు సుమారు రూ.30 లక్షల వరకు ఖర్చవుతుందని తన కుమారుడి వైద్యానికి సహకరించాలని బాలుడి తండ్రి సోషల్ మీడియా వేదికగా సహాయం కోరాడు. అది చూసిన గోకవరంలో వలంటీర్లు రూ.5,500 నగదును బాలుడి వైద్య ఖర్చుల కోసం సమకూర్చారు. ఈ మొత్తాన్ని మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి టంకాల శ్రీనివాస్‌రావు చేతుల మీదుగా బాలుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. బాలుడి వైద్యానికి సహకారం అందించిన వలంటీర్లను పలువురు అభినందించారు.

రేపు క్యాన్సర్ నిర్ధారణ శిబిరం

గోకవరం: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో గురువారం ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు వైద్యాధికారి డాక్టర్ వనజాకుమారి మంగళవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ శిబిరం జరుగుతుందన్నారు. 30 ఏళ్లు దాటిన స్త్రీ, పురుషులు ఈ పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఎంపీహెచ్ఈఓ వైఎస్ రాయుడు, సిబ్బంది పవన్, రమణ పాల్గొన్నారు.

బెల్లం ఊట ధ్వంసం

జగ్గంపేట: మల్లిశాల శివారులో సారా తయారీ కేంద్రాలపై ఎస్సై విద్యాసాగర్ మంగళవారం దాడులు చేశారు. ఈ దాడులలో 100 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకొని, సారా తయారీకి పాల్పడుతున్న ఏలూరి ముసలయ్యను అరెస్టు చేసి, కేసునమోదు చేసి కోర్టులో హాజరపరిచారు.